# ఆత్మహత్య

వెంకట సత్య సూర్య వరద సాయి ప్రసాదుకి ఆరోజు నిద్రపక్కపై నుంచి లేస్తుండగానే ఎడంకన్నదిరింది.

అవయవాలన్నాక అదటం సహజమని, అవి రాబోయే పరిణామాలకి, జరగబోయే సంఘటనలకి సంకేతాలని నమ్మటం మూఢత్వమని నాస్తిక వైద్యులు , రచయితలు వార పత్రికల్లో వాపోతున్నా, మన "వెససూవసా" ప్రసాదు నమ్మడుగాక నమ్మడు– పైగా అలా ప్రచారం చేసేవాళ్ళని క్షమించడు గూడాను.

శాస్త్రాలు, సాంప్రదాయాలు, ఆచారాలు, ఇవన్నీ సృష్టిలో ఒక భాగమని, వాటిని ఆచరించక విసమ్మరించటం, ఆగౌరవ పర్చటం ఆ సృష్టికర్త పట్ల అపచారం చేసినట్లే అవుతుందని అతడి నమ్మిక. సాంప్రదాయమంటే మనిషి సామాజిక జీవన గమనానికి స్పీడు బ్రేకరు లాంటిదని, శాస్త్రమంటే శాసించి (నీ మంచినికోరే) చెప్పేదని, ఇక ఆచారాలంటే ఆరోగ్యమైన అలవాట్లకి పెద్దవాళ్ళు చెప్పిన ప్రిస్క్రిప్షన్స్– అని అతడు చెప్పే భాష్యం.

'వెససూవసా' ప్రసాదు తండ్రి– ఆయన పేరేమిటో, ఎంత పొదుగ్గా వుండేదో తెలీదుగాని కొడుకు పుట్టి పేరు పెట్టాల్సి వచ్చినపుడు–ముందు ముందు రానున్న ముదనష్టపుకాలాన్ని అతి ముందుగానే జ్ఞాన నేత్రంతో దర్శించి ఎందుకైనా మంచి దని వూహలోకొచ్చిన ప్రతిదేవుడి పేరు దండగాగుచ్చి నామతోరణం కట్టారు. కొడుకు కష్టాల్లో పడితే ఒక దేవుడు కాకపోతే ఇంకొకరైనా ఆదుకుంటారని ఆయన వూహ.

కాని ఆయన అంచనా తప్పింది.

... ప్రసాద్ ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరంలో మూడేళ్ళుండిపోతే తోరణంలోని ఏ దేవుడూ దిగిరాక పోగా, తొంగికూడా చూడలేదు. అలాగే టైపుషార్టుహేండు (ఏ దేవుడిదయో?) పాసయ్యి, వుద్యోగం లేక ఏడాదిన్నర గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుండిపోతే, ఆ దేవుళ్ళందరూ పాలక వర్గ సభ్యుల్లాగా అతడ్ని గుర్చి పట్టించుకోక, యోగ నిద్రలో మునిగిపోయారు. పూర్తిగా అతడ్ని అతడి ఖర్మ కొదిలేసినా బాగుండేది. కాని, ఎక్కడ ఈ ప్రసాదు ఏ ప్రాంతీయ పార్టీలోనో, వుద్యమాల్లోనో వ్యాపారాల్లోనో ప్రవేశించి, సుఖపడి పోతాడేమో నన్న బెంగకొద్దీ అతగాడ్ని టైపిస్టు ఉద్యోగంలో దిగేసి, భార్యా పిల్లలనేమేకుల్ని జీవితానికి నాలుగు వైపులా కొట్టి కదలకుండా బందోబస్తు చేసారు.

ఆ ఫుల్ బెంచీ దేవుళ్ళకి అసలు జాలనే మాటే తెలీనట్టుంది. కాకపోతే, అయ్యో– పిచ్చికుంక మనందరి పేర్లు ఓపిగ్గా మ్రోస్తున్నాడే, వాడి సంగతేమిటో, బాధేమిటో, గోడవేమిటో, గోడేమిటో విందామని తద్వారా తమ తమ పేర్లు నిలబెట్టు కుందామన్న ధ్యాసే లేదు. నిజానికి ఆ విషయంలో తెలుగు రచయితలే మెరుగు. తమ పేర్లు పిల్లలకి పెట్టుకున్నామని తెలియజేస్తే నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తామని హామిలన్నా ఇస్తున్నారు.

ఆ విధంగా టైపిస్టు ఉద్యోగంలో చేరి, పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని, పళ్ళ చక్రం లాంటి బ్రతుకులో పర్మినెంటుగా ఇరుక్కుపోయాడు.

పసివాడి పాలడబ్బా గురించి, నిండుకున్న బియ్యం గురించి, పెద్దవాడి ఆరోగ్యం గురించి, భార్య కట్టుడు చీరల గురించి, షాపులో కట్టాల్సిన అప్పు గురించి ఆఫీసులో టైపు కొట్టాల్సిన పేపర్ల గురించి బాధపడటం రివాజై పోయి, జీవితంలో ఒక భాగంగా అయిపోయింది. తిట్టిపోయాల్సిన ఆఫీసర్ నవ్వుతూ పలకరించినా భయమే. జీతం రాదన్నా భయమే, వస్తుందంటే ఇంకాస్త భయం. భార్య ఆదరించినా, ఆక్షేపించినా కొలీగ్స్ హేళన చేసినా, చెయ్యకపోయినా, బ్రేకు నొక్కినపుడు సైకిలు ఆగినా, ఆగక పోయినా.... అన్నీ భయాలే– దిగుళ్ళే... శంకలే.

అలా భయంతో బ్రతుకుతున్నా 'వెససూవసా" ప్రసాద్‌కి దేవుడంటే నమ్మకం మాత్రం చెక్కు చెదిరింది కాదు.

తాను ఇంటర్ మొదటి సంవత్సరం గట్టెక్కటానిక్కారణం ఆ దేవుడి చలవేనంటాడు. మూడేళ్ళు రెండో సంవత్సరంలో వుండి పోవటం వెనుక అర్థం కాని దైవ రహస్యం వుండి వుంటుందంటాడు. ఆయన కృప చేతనే ఈ మాత్రం ఉద్యోగమన్నా దొరికిందని వాదిస్తాడు. తాను పడుతున్న కష్టాలకి, అనుభవిస్తున్న వేదనకి కారణం వెనుక జన్మలోని పాపఫలం అంటాడు. భగవంతుడంటే పాపపుణ్యాల ఎకౌంటు చూసే బ్యాంకు మేనేజర్లాంటివాడు. నీ ఎకౌంట్లో బ్యాలన్స్ లేనపుడు చెక్కు చేత్తో పుచ్చుకుని

బ్యాంకుకెడితే అక్కడి మేనేజర్ ఎంత మంచివాడైనా ఏ విధంగా సాయం చెయ్యలేడో, అదే విధాన, గత జన్మల పాప ఫలాన్ని నెత్తిన పెట్టుకుపుట్టి మంచి ఫలితాలనిమ్మంటే ఆ దేవుడు కూడా ఏమీ చెయ్యలేడు– ఇలా సాగిపోతోంది అతడి తార్కిక చింతన.

ఇంతకీ అసలు విషయానికొస్తే–

ఆరోజు నిద్రమంచం పైనుంచి లేస్తుండగా ఎడంకన్నదిరేసరికి భయంతో గడగడలాడేడు. ఏ అవాంతరం, ఆపదొస్తున్నదోనని బెంగపడ్డాడు. పేరులోని దేవుళ్లందర్నీ పేరు పేరు వరసనా తల్చుకుని ఆ రోజు ఏ ఆపద; అవాంతరం లేకుండా గట్టెక్కించమని గట్టిగా ప్రార్థించి మంచం దిగేడు.

మొహం కడిగి, స్నానంచేసి, భోజనం అయిందనిపించి, పాత డొక్కు సైకిలు పై ఆఫీసుకెళ్ళి, మిషను ముందర కూర్చుని యాంత్రికంగా పన్చేస్తున్నప్పుడు గూడా ఎడంకన్నదిరిన విషయం గుర్తుకొచ్చి, భయం ఒక ప్రక్కన తుమ్మ ముల్లులా మనస్సులో గుచ్చుకుంటూనే వుంది.

అసలా వుపద్రవం ఇంట్లోనే అనుకున్నాడు. ఆఫీసుకొచ్చాక ఆఫీసరుతో చిన్న విషయంపైని పెద్ద రాద్ధాంతం తప్పదేమో ననుకున్నాడు. కానీ అటువంటిదేదీ జరుగక ఆఫీసు పూర్తయ్యి ఇంటిదారి పట్టినపుడు– యాక్సిడెంటు ఖాయం అని సిద్ధపడ్డాడు. కాని సజావుగా, సజీవంగా ఇంటికి చేరి సైకిల్ని ఇంటి ముందరి మొండి గోడకి అన్చి (స్టాండు విరిగిపోయిందిగా) హమ్మయ్య అని గుండెల నిండా వూపిరి పీల్చుకుంటూ లోనికొస్తుంటే గడపలోనే భార్య సుగుణ ఎదురయ్యి– "మీ

పతంజలి బాబాయిగారొచ్చార" న్న వార్తని చల్లగా చెప్పింది. పతంజలి బాబాయి రాకకి తన ఎడంకన్ను అదరటానికి సంబంధమేదైనా వుందాన్న ఆలోచన రానందువల్ల సంతోషాన్ని ప్రకటించేడు.

"ఎంత సేపయింది, ఎప్పుడొచ్చాట్ట" అనడుగుతూ లోనికొచ్చి కుర్చీ అని పిల్చుకునే ముక్కాలి వస్తువుపై చాకచక్యంగా కూర్చున్నాడు.

"మధ్యాహ్నం బండీకొచ్చార్ట. భోంచేసి, కాస్సేపు నడుం వాల్చి, ఇప్పుడే అలా బజార్లోకెళ్ళొస్తానని వెళ్ళారు" అంది సుగుణ.

పతంజలి అతడికి స్వయానా పినతండ్రి. జాతీయం చెయ్యబడ్డ బ్యాంకులో ఆఫీసరు. నెలతిరిగే సరికి నాలుగంకెల జీతం. తిరుపతిలో రెండంతస్థుల భవనం. విజయవాడలో స్థలం, ఇంజనీరు చదువుతున్న కొడుకు, మెడిసిన్ చదవాలనుకుంటున్న కూతురు, మహలక్ష్మిలాంటి భార్య (పేరు సరస్వతి– చదువురాదు) ఆవిడ పుట్టింటినించి తెచ్చిన రెండెకరాల పొలం– ఇవన్నీ ఆయన స్థిర చరాస్తులు. అసలు ప్రసాదు చాలాసార్లు బ్రతుకుతే పతంజలి బాబాయిలాగా బ్రతకాలని వువ్విళ్ళూరేవాడు. (ఇప్పుడు కాదు) అటువంటి స్థితిమంతుడు, హోదాపరుడు. తనపైన ప్రేమ, అభిమాన వాత్సల్యాలతో గడపలో అడుగు పెట్టటం ఎంతదృష్టం.

"వెనసూవసా" ప్రసాదు ఎంతగా పొంగిపోయాడంటే అసలు ఉదయం అదిరింది కుడికన్నా, ఎడంకన్నానే అనుమానం వచ్చేటంత.

అతడలా పరవశంలో ఉండగానే సుగుణ కాకిరంగు సంచిని, సత్తు టిఫిన్ క్యారేజీని తెచ్చి అతని చేతికిచ్చింది.

"వెనసూవసా" వెర్రిగా చూసేడు ఆమె వైపు అర్థం కానట్లు. "అలా చూస్తారేం– త్వరగా వెళ్ళి రెండు రకాల కూరలు, అరకిలో నెయ్యి పోయించుకురండి" హుకుం జారీ చేసింది సుగుణ.

అది వినంగానే వెర్రి చూపుల్తోపాటుగా నోరుగూడా తెరిచాడు "నెయ్యా" అంటూ. సీతమ్మగారు బంగారు లేడిని కోరినప్పుడు కూడా అంతటి ఆశ్చర్యం, కంగారు పడుండరు రాములవారు.

భర్త ప్రవర్తన సుగుణకి కాస్త చిరాకనిపించింది. "అంతలా ఆశ్చర్యపోతారేమిటి– ఇంటికొచ్చిన చుట్టానికి నెయ్యి లేకుండా తిండి పెడితే ఎంత నామర్దా" అంది సాగదీస్తూ.

అతడలా కంగారు, ఆశ్చర్య పడటం లోని కారణం నింపాదిగా ఆలోచిస్తే అర్థమౌతుంది. "నెయ్యి" అనే ఆ రెండక్షరాల పదాన్ని ఆ యింట్లో పిల్లలు, పెద్దలు స్మరించుకుని, రుచిచూసి చాలాకాలమైంది.

ప్రసాద్ వీధిన బడ్డాడు.

సుగుణ చెప్పింది నిజమే. బాబాయి రాక రాక వస్తే మర్యాదలు ఘనంగా చెయ్యొద్దూ. ఆయనేం మళ్ళీ మళ్ళీ వస్తాడా? అయినా పెద్దవాళ్ళేం చెప్పారు? పితృదేవోభవ– గురుదేవోభవ– అతిథి దేవోభవ– అంటే వీళ్ళందరూ దేవుళ్ళతో సమానం అని. కాని, నెయ్యి దుకాణం వాడు దేవోభవ– అని అన్లేదే– పాపం మర్చిపోయుంటారు.

"వెససూవసా" ఒక షాపుముందు ఆగేడు.

అది నెయ్యి దుకాణం– బయట ధరల పట్టీ నవ్వుతున్న అస్థిపంజరంలా వ్రేలాడుతోంది. అతడు కళ్ళుచిట్లించి బోర్డుపై అక్షరాలని చదివాడు. ప్రక్కనే వున్న అంకెలనిండా పరిశీలించేడు.

ఒక్కసారిగా మొహంలో రంగు మారింది.

'అబ్బో రేట్లు బాగా పెరిగాయే' అనుకుంటూ చేతిని జేబులోనికి పోనిచ్చి అక్కడి పరిస్థితిని వ్రేళ్ళతోనే పరిశీలించాడు. వారం క్రితం అవధాని వద్ద పుచ్చుకున్న పచ్చకాగితంలోని ఆఖరి పదికాగితం వెలుగు చూసింది.

బజార్నించి అతడు ఇంటికి వెళ్ళేసరికి పతంజలి బాబాయ్ ముందు గదిలో గచ్చు నేలపైన చతికిలపడి కూర్చుని 'బడుగు– వర్గాలుబాంకు" రుణాలు' అనే అంశంపై అనర్గళంగా మాట్లాడుతున్నారు. సుగుణ వంటపని చేసుకుంటూనే పైకి 'వూ' గొడుతూ లోపల విసుక్కుంటోంది.

అతడ్ని చూడంగానే ఆయన సబ్జెక్టులోంచి కాస్త ప్రక్కకు వచ్చి 'వచ్చేవురా– నాన్నా' చాలా ఆప్యాయంగా అంటూ కాస్త జరిగి అతడింట్లో అతడికి దయతో చోటిచ్చాడు. ఆ పలకరింపుకి పొంగిపోయాడు. చేతిలోని సరంజామాని భార్యకందించి, ఆయన ప్రక్కన కూర్చున్నాడు– "ఏం బాబాయ్ కులాసానా– పిల్లలు బావున్నారా" అంటూ సంభాషణ ప్రారంభించాడు.

పతంజలి బాబాయ్ అన్నిటికి చిరునవ్వుతో బదులిచ్చి "అదేవిట్రా అలా చిక్కిపోయేవ్– తిండి కూడామాని పొదుపు చేస్తున్నావా" అని ఆమాటకి తనకి తనే ఘొల్లున నవ్వేరు.

ఆఫీసరు, అప్పిచ్చువాడు, అతిథి, వయస్సులో వున్న కన్నెపిల్ల– వీళ్ళంతా ఏం మాట్లాడినా నవ్వటం అనేది కనీస ధర్మంగా గుర్తించాడు కాబట్టి సన్నగా నవ్వి "పిన్నిని పిల్లల్ని కూడా తీసుకురాలేక పోయావా" అన్నాడు మర్యాదకి. నిజంగా అదే జరిగుంటే అతడి పేరుముందు "కీ.శే. అనిన్నూ, అతడి ఫోటోకి పూలదండ చక్కగా అమిరేది.

నే బ్యాంకు పనిమీద వచ్చా (రైల్లోను, బస్సులోను కానట్లు) – ట్రైనింగ్ అని తెలివిగా ఆమాటని, అక్కడితో తుంచేసి "అన్నట్లు ఈ మధ్య మనూరెళ్ళి చూసొచ్చా" నంటూ వేరే విషయంలోకి వెళ్ళిపోయారు.

సుగుణ వంటయిందని భోజనాలకి రమ్మని పిలిచేవరకు ఫ్లాష్ బాక్ లోకి వెళ్ళి పాత సంగతులు చెప్పుకుంటూనే వున్నారు.

పతంజలి బాబాయ్ భోజనం చేస్తూనే, ఇంకా అనేక సంగతులు వెల్లడించారు. రాజకీయాల గురించి విదేశాలలో గుండెల ఆపరేషన్ గురించి, స్వదేశాలలో వెన్నుపోట్లు గురించి, తనింటిని గురించి, పూల మొక్కలను గురించి, కుక్కల పెంపకం గురించి 'వె స సూ వ సా" వివరంగా వింటున్నాడు గాని సుగుణ మాత్రం టీవీ కార్యక్రమాన్ని చూస్తున్నట్లు విసుగ్గా మొహం పెట్టింది.

పతంజలిబాబాయ్ తక్కువవాడేం కాదు. టక్కున ప్లేటుమార్చి ఆమె వంటను మెచ్చుకున్నాడు. పుట్టి బుద్ధి తెలిసాక ఇటువంటి తిండి తిన్లేదన్నారు. అక్కడ లేదుగనక తన భార్యనీ ఆమె వంటకాన్నీ ఆడిపోసుకున్నారు. ఇల్లు చిన్నదైనా ముచ్చటగా వుందన్నారు. పిల్లలు బలహీనంగా వున్నా బంగారపు బొమ్మల్లా వున్నారన్నారు.

భోజనాలయ్యాక 'వె స సూ వ సా" ఇంట్లో వున్న ఏకైక పరుపుని, మెత్తటి దిండుని, వెచ్చటి రగ్గుని బాబాయిగార్కి సమర్పించి, ముందు గదిలో పడక ఏర్పాటు చేసి, ఉన్న ఒక్క టేబిలు ఫ్యాన్ని గూడా సౌకర్యంగా అమర్చి సుఖనిద్ర పొమ్మన్నాడు.

పతంజలి బాబాయ్ పదినిమిషాల్లో గుడ్లగూబలు కూడా భయపడేటట్లుగా గురక పెడుతూ నిద్రలోకి జారేరు.

వంటగదిలో ఎంగిలి కంచాలు తీసేసి, నీళ్ళుచల్లి శుభ్రం చేసి, నేల అరిందాకా ప్రసాద్ అండ్ ఫ్యామ్లీ సహనంగా కూర్చుని, ఆపైన పాత చిరుగుల కంబళీని పొడుగ్గా పరచి, పిల్లల్ని వరుసగా లెక్క ప్రకారం పడుకోబెట్టి ఆ దంపతులు దాదాపు నేలపైననే

నడుం వాల్చేరు.

చల్లటి గుచ్చుపైని గొంగళీ చల్లగా గిల్లుతుండగా సుగుణ భర్త చెవిలో మెల్లిగా అంది– "ఎన్నాళ్ళుంటార్ట– మామయ్య గారు".

"ట్రైనింకొచ్చాట్ట– ఇరవై రోజుల్ట" ఆపైన ఏం చెప్పాలో తెలీక మౌనంగా వుండిపోయేడు ప్రసాద్.

"ఇరవై రోజులు ఇక్కడే వుంటే... అవస్థగదండి".

"వెసనూవసా"కి ఆసంభాషణ రుచించలేదు. పతంజలి బాబాయ్‌లాంటి పెద్దవాళ్ళమనింటికి ప్రేమతోను, వాత్సల్యంతోను వస్తారు గాని, అన్నానికి మొహంవాచి వస్తారా; అనేది అతని లైనాఫ్ థింకింగ్. భార్యకి ధైర్యం చెప్పే ప్రయత్నంలో, "మనం వుండమన్నా ఆయనుండడు. ఏ క్లాసు ఆఫీసరుకి ట్రైనింగంటే పెద్ద హోటల్లో బ్యాంకు వాళ్ళే బస ఏర్పాటు చేసుంటారు– మర్యాదకి, పలకరింపుకి వచ్చుంటాడు" అన్నాడు.

సరిగ్గ అక్కడే మనవాడు నాణ్యమైన షోలాపూరు కందిపప్పులో కాలేసాడు.

ఆ మర్నాడు బాబాయ్ నిద్ర లేచేసరికి, ప్రసాద్ బజారెళ్ళి ప్లేటు ఇడ్లీని (సర్కారు వాడి ఇడ్లీ కాదు) పొట్లం కట్టించుకొచ్చేడు. సుగుణ చక్కటి చిక్కటి కాఫీని గ్లాసులో పోసి చేతికిచ్చి, ఆపైన గోరు వెచ్చని నీళ్ళు స్నానానికి తోడింది.

బాబాయ్ దేనికీ అభ్యంతరం చెప్పలేదు.

ఆయన తన పన్లన్ని పూర్తి చేసుకుని వెళ్ళబోతూ భోజనానికి మధ్యాహ్నం వస్తానని, ప్రసాద్‌ని ఆఫీసుకి, పిల్లల్ని స్కూళ్ళకి వెళ్ళమని, అమ్మాయిని (అంటే సుగుణని) తనకోసం కనిపెట్టుక్కూర్చోకుండా భోంచేసెయ్యమని, ఆర్డర్లు జారీ చేసి అర్జెంటుగా వెళ్ళిపోయాడు.

ఆయన వాలకం చూసేక ఇరవై రోజులు ఇక్కడే వుండి లాగించేస్తాడేమో అన్న అనుమానం మొదటిసారిగా కలిగింది ఆ దంపతులకి. అదే నిజమైతే అతిథి మర్యాదలవల్ల తల్లక్రిందులు కానున్న లోటు బడ్జెటుని పూరించేందుకు ఎంత అప్పు చెయ్యాలాని ఆలోచిస్తూ భార్య చూపుల్ని తప్పించుకుని, డొక్కు సైకిలుతో సహా రోడ్డున బడ్డాడు ప్రసాద్.

* * *

వాళ్ళనుకున్నంతా అయింది.

బాబాయ్ ఇరవైరోజు ట్రైనింగ్ కార్యక్రమాన్ని వాళ్ళింట్లోంచే పూర్తి చేసేడు.

నిద్రలేచి మొహం కడుక్కోగానే ఇడ్లీ, చిక్కటి కాఫీ, స్నానానికి వేడినీళ్ళు, మధ్యాహ్నం రెండు కూరలతో సుష్టుగా భోజనం, కాస్సేపు విశ్రాంతి, సాయం కాలాలు సిటీ దర్శనం, రాత్రికి మళ్ళీ కొత్త వంటకాలతో భోజనం, మళ్ళీ కాస్సేపు కబుర్లు, ఆపైన మెత్తటి పరుపు పైన – పవళింపు– బాబాయ్ ఇరవై రోజుల్లో బరువు పెరిగాడు.

కాని "వెసనూవసా" ఎండిపోయి గడకర్రలా తయారయ్యాడు, సుగుణ కూడా కాస్త తగ్గింది. చాకిరీమాట అటుంచి, తనకు తెల్సిన వంటన్నీ వండి వార్చింది. ఇంక ఏం చేసిపెట్టాలన్న దిగులు ఆవిడదయితే, తెలిసినచోటల్లా అప్పు తెచ్చాను. ఇంకెక్కడ లేవాలిరా భగవంతుడాని ప్రసాద్ దిగులు.

ఎట్టకేలకు పతంజలి బాబాయ్ కార్యక్రమం పూర్తి చేసుకుని ఆరోజే తిరుగు ప్రయాణం.

ఆయన ఆరోజు ఆరింటికి అన్నం తిని, మూత్తుడుచుకుని, పెట్టె బెడ్డింగు సర్దుకుని తయారైనారు. ప్రసాద్ స్టేషన్‌దాకా వస్తానన్నాడు. అలా అనటానికి కారణం, మర్యాదకే గాని ఆయన తిరిగొస్తాడేమో నన్న భయంవల్ల కాదు.

ఆయన గడప దాటబోతూ చిపుక్కున జేబులోంచి పర్సుతీసి, దాంట్లోంచి నాలుగు పెళ పెళలాడే (బాంకువారు కదా) రెండ్రూపాయల కాగితాలు తీసి వరుసగా నిల్చున్న పిల్లల చేతుల్లో భూమి పట్టాలిస్తున్న మంత్రిలా పంచిపెట్టారు.

ప్రసాద్ దంపతులు ఎంత చెపుతున్నా వినిపించుకున్నారు కాదూ.

"అదేవిటమ్మా అలా అంటావ్" నేనేమన్నా పరాయివాడినా, ఏదో రాకపోకలు లేక కొత్తగా అనిపిస్తుందేగాని, ఎంత దగ్గిర వాళ్ళం. నిజానికి తిరపతిలో రైలెక్కే వరకు హోటల్లోనే వుండాలనుకున్నా. కాని రైలెక్కి కాస్సేపు కునుకుతీసా. ఆ మాగన్నుగా పట్టిన నిద్రలోనే అన్నయ్య, (అంటే ప్రసాద్ తండ్రి) కనిపించి– ఏరా– ఆవూరెళ్ళి హోటల్లో వుంటావా? అంటే నాతోపాటే మన బంధుత్వాన్ని మంటగలిపేవా? పసిగాడు (అంటే వెససూవసా) ఎంత బాధపడతాడు అన్చెప్పి కేకలేసాడు. అన్నయ్యంటే ఎంత గౌరవమో మీకు తెలీదు. (ఆయన పోయినప్పుడు దహన సంస్కారాలకి ప్రసాద్ వెయ్యి రూపాయలు సర్దమని అడిగితే చెక్కుబుక్కు మర్చిపోయి వచ్చానని చెప్పి తప్పుకున్నాడు. అది వేరే విషయం) అంతే రైలు దిగి మనసు మార్చుకుని పసిగాడి ఇంటికొచ్చాను' అంటూ పిట్టకథని పట్టుగా చెప్పేడు.

ప్రసాద్ ఆ కథకి కరగిపోయేడు. కళ్ళల్లో నీళ్ళు నింపుకున్నాడు. సుగుణకి మాత్రం కాస్తభయంగా వుంది. మావయ్యగారు. మాటల్లోపడి ఎక్కడ రైలు మిస్సవుతారోనని.

ఎట్టకేలకు పతంజలి లగేజీతో బయటికెళ్ళాడు.

స్టేషన్లో ఆయన ఫస్టుక్లాసు డబ్బాలో సరంజామా సర్దుకుంటుంటే, ప్రసాద్ ఫ్లాట్‌ఫారంపై నిల్చుని, కంపార్టుమెంటు కడ్డీలని పట్టుకు వ్రేలాడసాగేడు ముద్దాయిలా.

గత ఇరవై రోజుల్లో అనేక సందర్భాల్లో బాబాయ్ చెప్పిన అనేక సంగతులు తెరలు తెరలుగా గుర్తుకి రాసాగేయి. తిరుపతిలో లంకంత ఇల్లు, విజయవాడలో స్థలం, పెద్ద చదువులు చదువుతున్న పిల్లలు, భార్యకి చేయించిన నగలు, ఇంటో

ఖరీదైన సామాన్లు, వీటిల్లో ఒక్కటైనా తను తన వాళ్ళకోసం అమర్చగలడా? మర్యాదా మాటున ఈ ఇరవై రోజుల్లో బాబాయ్‌కి చేసిన పోషణ, ఆయనపైన చూపిన శ్రద్ధ ఎప్పుడూ తన భార్య పిల్లలపైన చూపలేదే? అది తన నిర్లక్ష్యమా? అమాయకత్వం, అజ్ఞానమా? తనని తను మోసం చెయ్యటం లేదుగదా, ఆచారాలు, సాంప్రదాయాలు, మర్యాదల పేరిట తనని తను చంపేసుకుంటున్నాడా?

ఆలోచనల్లధాటికి వొళ్ళు గగుర్పొడిచింది. కళ్ళు చమర్చాయి.

సరిగ్గా అదే సమయానికి లోపల తన సుఖం కోసం కావాల్సిన ఏర్పాట్లు చేసుకుని బాబాయ్ కిటికీలోంచి తలని బయటికి పెట్టి ప్రసాద్ కంటతడికి కన్వీనెంటుగా ఇంకో అర్థం చెప్పుకుని.

'ఛ– దిగులుపడకు. నేనప్పుడప్పుడు వస్తుంటాగా' అన్నాడు.

ప్రసాద్ గుండెదడ రైలు కూతలో కల్సిపోయింది.

రైలు కదిలింది.

'వెససూవసా' వేసినచోట వేసినట్టే వెర్రిగా చూస్తూ వుండిపోయేడు. బరువు పెంచుకున్న బాబాయ్ మెత్తటి పరుపులపై కూర్చుని ముమ్మందుకెళ్ళాడు.

వెడుతూ–

ఈ ఇరవై రోజుల్లో కూడబెట్టిన బాంకు వారిచ్చే దినభత్యం పన్నెండు వందలు పెట్టి బంగారం కొనటమా లేక ఫిక్సిడ్‌లో వెయ్యటమాని తేలక సందిగ్ధంలో వుండగా–

పాతసైకిలుని స్టేషన్ స్టాండులోంచి బయటికి తెచ్చి దానిపైకి వొడుపుగా ఎక్కి కూర్చుని, బాబాయ్ ఆతిధ్యపు తాలూకు అప్పుని ఎలా తీర్చాలి, తీర్చాలంటే తను, భార్యా పిల్లలు ఏ ఏ త్యాగాలు చెయ్యాలి, చెయ్యటానికింకా ఏం మిగిలున్నాయని ఆలోచిస్తూ– పాత జీవితంలోకి, పాత సమస్యల్లోకి, పాత దిగుళ్ళల్లోకి, పాత సైకిల్ని పట్టుదలగా పరిగెత్తిస్తున్నాడు– వెంకటసత్య సూర్య వరద సాయిప్రసాద్.